# సింగిల్ పేజీ కథలు

# పశ్చాత్తాపం

"బాబూ ప్రొద్దున్నుంచి మా మనవరాలికి తెగ వాంతులయిపోతున్నాయి. డాక్టరుగారిని కొంచెం తొందరగా చూడమనండి. మీకు ఎంతైనా పుణ్యం ఉంటుంది" అంటూ కాంపౌండర్ కనకయ్యని బ్రతిమాలుతున్నాడు చేతిలో ఒక పదేళ్ల పాపని ఎత్తుకొచ్చిన ముసలతను.

"ఏంటయ్యా నీ నస అసలు కార్డు తీసుకున్నావా?" అడిగాడు కనకయ్య.

"తీసుకోలేదు బాబూ ఎంతవుతుందేంటీ" అడిగాడతను.

"మామూలు కార్డు అయితే 80 రూపాయలు. అది తీసుకుంటే సాయంకాలం అవుతుంది. అదే స్పెషల్ కార్డు అయితే 150 రూపాయలు. అది తీసుకుంటే ఒక పది నిమిషాల్లో డాక్టరుగారు చూసేస్తారు. ఏం రాయమంటావు" అడిగాడు కనకయ్య.

"అయ్యో అంత డబ్బు లేదు బాబూ 50 రూపాయలే ఉంది ముందు డాక్టరుగారిని చూడమనండి. డబ్బులు ఎలాగోలా తర్వాత పట్టుకొస్తాను. పిల్ల ఒళ్లు కూడా కాలిపోతందయ్యా గిలగిల్లాడిపోతోంది".

"ఏంటయ్యా నీ గోల. ఇదేమన్నా నా ఆసుపత్రి అనుకున్నావా? నీలాంటి వాళ్ల మీద జాలి చూపిస్తే నా ఉద్యోగం ఊడుతుంది" అన్నాడు కనకయ్య.

ఇంతలో ట్రింగ్‌మంటూ బెల్ మోగింది.

"డాక్టరుగారు పిలుస్తున్నారు నెక్స్ట్ ఎవరూ?" అంటూ లోపలికెళ్లాడు కనకయ్య.


"సార్" అంటూ వినయంగా చేతులు కట్టుకు నిలుచున్నాడు కనకయ్య. "ఏంటీ బయట గొడవ" అడిగాడు డాక్టర్ మహేష్.

"ఎవరో సార్, అర్జెంటుగా పేషెంటుని చూడాలంటాడు స్పెషల్ కార్డు కాదు కదా కనీసం మామూలు కార్డు తీసుకోవడానికి కూడా పూర్తిగా డబ్బులు లేవంటాడు" అన్నాడు కనకయ్య.

అసహనంగా మొహం పెట్టాడు డాక్టర్ మహేష్.

"ఇదొక న్యూసెన్సు.. పొరపాటున ఒకళ్లని జాలి తలిచామంటే ఇక అందరూ అదే మొదలుపెడతారు. కుదరదని చెప్పి పంపేయ్. డబ్బులు పెట్టలేనప్పుడు గవర్నమెంటు హాస్పిటల్‌కి పోవచ్చు కదా. ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌కి ఎందుకు రావడం? డబ్బు లేకపోయినా కాస్త్ర ట్రీట్‌మెంటు అదీ అర్జెంటుగా కావాలి తేరగా" అంటూ విసుక్కున్నాడు డాక్టర్ మహేష్.

డాక్టర్ మహేష్ అంటే ఆ ఊర్లో మంచి పేరే ఉంది. హస్తవాసి మంచిది. బాగా వైద్యం చేస్తాడు అని. మొదట్లో అందరికీ ఒకటే కార్డు. ఒకేలా చూసేవాడు. రానురాను పేషెంట్లు పెరిగి డబ్బు



సంపాదనతో వచ్చిన గర్వం వల్ల మిగతా డాక్టర్లు కొంతమందిని చూసి స్పెషల్ కార్డు సిస్టమ్ పెట్టాడు. స్పెషల్ కార్డు రాయిస్తే ముందు చూస్తాడు. అదే మామూలు కార్డు అయితే ఎంత సీరియస్ అయినా గంటల తరబడి వెయిట్ చేయవలసిందే.

కాంపౌండర్ కనకయ్య చెప్పింది విని ఉసూరుమంటూ బయటకి నడిచాడు ఆ ముసలతను.

★ ★ ★

"రాణీ అన్నం పెట్టు తొందరగా. లేటవుతోంది" అరిచాడు డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న మహేష్.

"ఎప్పుడూ హాస్పిటల్, పేషెంట్లు. డబ్బు సంపాదన తప్ప పెళ్లాం, పిల్లలూ వాళ్లతో సరదాగా గడుపుదాం అన్న ధ్యాసే లేదా మీకు" అంది రాణి.

"అలా అడుగు మమ్మీ డాడీని" అంది కూర్చీ లాక్కుని కూర్చుంటూ మహేష్ కూతురు ప్రీతి.

"ప్రీతీ మాధవ్ ఇంకా భోజనానికి రాలేదేం" అడిగాడు మహేష్ కూతుర్ని.

"ఇదిగో డాడీ వస్తున్నా" అంటూ వచ్చాడు మాధవ్.

★ ★ ★

"హాలీడేస్ బాగా ఎంజాయ్ చేశారా ప్రీతీ, మధూ" అడిగాడు పిల్లల్ని మహేష్.

"థాంక్యూ డాడీ చాలా బాగా ఎంజాయ్ చేశాం" అన్నారు ఇద్దరూ.

"అవునండీ చాలా రోజులయింది కదా ఇలా టూర్‌కి వచ్చి మనం" అంది రాణి కూడా. వాళ్లు తిరుగుప్రయాణంలో బస్‌లో ఉన్నారు.

"ఇంకెంత టైమ్ పడుతుంది డాడీ" అడిగింది ప్రీతి.

"ఇంకా అయిదు, ఆరు గంటలు పడుతుందేమో" అన్నాడు.

సాయంకాలం కావస్తోంది. పొలాల మధ్యలోంచి బస్సు వెళుతోంది కదా గాలి బాగా వీస్తోంది కదండీ అంది రాణి. ఇంతలో సడెన్ బ్రేకుతో బస్సు ఆగింది. మొహానికి ముసుగులు వేసుకున్న నలుగురు మనుషులు బస్సు ఆపి ప్రయాణీకుల్ని బెదిరించి వాళ్ల దగ్గరున్నవన్నీ దోచుకున్నారు. అందరితో పాటు డాక్టర్ మహేష్ ఫ్యామిలీ కూడా ఉత్త చేతులతో నిలబడిపోయారు. అందరూ బస్సు దిగి వాళ్లని పట్టుకుందామని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. "చేసేదేముంది బస్సు ఎక్కండి దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో కంప్లైంటు ఇచ్చి బయలుదేరుదాం" అన్నాడు కండక్టర్. ఇంతలో ఒక్కసారిగా మాధవ్ కళ్లు తిరిగి కింద పడి బాధగా అరవసాగాడు. అది చుట్టూ పొలాలు ఉన్న ప్రాంతం కావడంతో ఏ పురుగో కుట్టి ఉంటుందని అర్థం అయింది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో తను డాక్టర్ అయినా ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా చూశాడు. "దగ్గర్లో ఏదైనా హాస్పిటల్ ఉందేమో వెళదాం పదండి" అన్నారందరూ. నలుగురైదు

గురు కలిసి మహేష్‌తో కలిసి మాధవ్‌ని తీసుకుని దగ్గర్లో ఉన్న హాస్పిటల్‌కి వెళ్లారు. లోపలకెళ్లిన మహేష్ అక్కడ ఉన్న నర్స్‌తో బాబుకి ఏదో పురుగు కుట్టింది డాక్టర్‌ని తొందరగా చూడమనండి ప్లీజ్ అన్నాడు.

''ముందు డబ్బు కట్టి కార్డ్ తీసుకోండి తరువాత డాక్టర్‌గారు చూస్తారు'' అంది తాపీగా నర్స్.

''అదేంటి సిస్టర్? బాబు ప్రాణం చావుబ్రతుకుల మధ్య ఉంటే డబ్బులంటారేంటీ ముందు డాక్టర్‌ని చూడమనండి. నేనూ డాక్టర్‌నే. డబ్బులు మీకు ఎలాగైనా తరువాతైనా పంపుతాను. కొన్ని కారణాల వల్ల మేము డబ్బు పోగొట్టుకున్నాం'' అంటున్న మహేష్ మాటల్ని వినకుండా..

''అలాంటివేమీ ఇక్కడ కుదరవండీ. డాక్టరుగారు చూడాలంటే డబ్బు కట్టాలి. అదీ తొందరగా చూడాలంటే స్పెషల్ కార్డు ఎక్కువ డబ్బు కట్టి తీసుకోవాలి. ఇక్కడే కాదు. ప్రతీ హాస్పిటల్‌లోనూ ఈ రూల్స్ మామూలే. అంతగా డబ్బులు కట్టలేకపోతే గవర్నమెంటు హాస్పిటల్‌కి పోవచ్చు కదా'' అంది నర్సు నిర్లక్ష్యంగా.

చెంపమీద ఛెళ్లున కొట్టినట్లయింది డాక్టర్ మహేష్‌కి గతం గుర్తొచ్చి నోట మాటరాక నించున్నాడు. ఇంతలో ఇదంతా దూరం నుంచి చూస్తున్న ఒక పెద్దాయన ''సిస్టర్ మనీ నేనిస్తాను స్పెషల్ కార్డు రాసి ఆ అబ్బాయిని వెంటనే చూడమని డాక్టరుగారికి చెప్పండి'' అన్నాడు. మహేష్‌కి దేవుడిలా కనిపించాడాయన కృతజ్ఞతగా చూశాడాయన వైపు.

''కుట్టింది ఏదో ప్రమాదకరమైన పురుగే కానీ సమయానికి తీసుకురావడం వల్ల సేవ్ చేయగలిగాం'' అన్నాడు డాక్టర్. డాక్టర్‌కి కృతజ్ఞతలు చెప్పిన మహేష్ ఆ పెద్దాయన వైపు తిరిగి ''అంతా మీ చలవే. మీరు సమయానికి డబ్బు కట్టి సాయం చేయకపోతే మా అబ్బాయి మాకు దక్కేవాడు కాదు'' అంటున్న మహేష్‌తో ''డబ్బుదేముందండి. ఇవాళ కాకపోతే రేపు సంపాదించవచ్చు అన్నిటికన్నా విలువైనది మనిషి ప్రాణం. దానిని డబ్బుతో ముడిపెట్టి చూడలేం కదండీ'' అన్నాడు ఆ పెద్దాయన. ''అయినా పాపిష్టి డబ్బు కోసం మనుషుల ప్రాణానికే ఆపద కలుగుతుంటే నేనే కాదు మీరైనా చూస్తూ ఊరుకోలేరు కదండీ'' అన్నాడాయనే మళ్లీ.

గుండెల్లో పశ్చాత్తాపం కలుగుతుండగా ఆయనకి మరోసారి కృతజ్ఞతలు చెప్పి అక్కడి నుంచి కదిలాడు డాక్టర్ మహేష్.

''ఇక నుంచి మన హాస్పిటల్‌లో స్పెషల్ కార్డు సిస్టమ్ తీసేయాలి. ఒకటే కార్డు. అది కూడా పేదవాళ్లకు ఉచితంగా వైద్యం చేస్తాను. డబ్బు లేదని ఎవరూ వైద్య సహాయం లేక ఇక్కడ్నుంచి వెనక్కి వెళ్లకూడదు'' అంటున్న డాక్టర్ మహేష్ వైపు ఆశ్చర్యంగా చూశారు కనకయ్య మిగిలిన స్టాఫ్ అందరూ. ఆ రోజు నుండి డాక్టర్ మహేష్ మంచి హస్తవాసి ఉన్న డాక్టర్‌గానే కాక మంచి మనసున్న డాక్టర్‌గా కూడా పేరు తెచ్చుకున్నాడు.

**-పెండ్యాల నీరజ**
**(గుమ్మపూడి)**

# సగటు మనుషులు

మా జయరాం అంకుల్ కూతురు పెళ్లికి ధర్మవరం బయలుదేరాను. బస్‌లో సీట్లలో నిండుగా జనం ఉన్నారు. బస్‌లో విండోసైడ్ కూర్చోవడమంటే నాకిష్టం. కానీ విండో దగ్గర సీట్ దొరకలేదు. చలికాలం కావడం వలన చల్లగాలికి విండో గ్లాసులు బిగించారు. సీట్ చివరలో కూర్చుని 'ఆంధ్రభూమి' డైలీ తీశాను. వెంటనే ''జిల్లా స్పెషల్ ఇవ్వండి'' అంటూ నా పక్కనున్న వ్యక్తి తీసేసుకున్నాడు. ''మధ్య పేజీ ఇవ్వండి'' అంటూ వెనుక నుండి వినిపించింది. తప్పదు కదా! పేపర్ చేతిలో ఉంటే ఇలాంటి పరిస్థితి మామూలే. ఇచ్చేశాను.

నా పక్కనున్న వ్యక్తి జిల్లా స్పెషల్ చూడబోతే ఆయన పక్కన విండో సైడ్ ఉన్న వ్యక్తి అందులో ఓ పేజీ తీసేసుకున్నాడు.

పేపర్స్ చేతులు మార్చుకుంటూ రాజకీయాల గురించి, ఫ్యాషన్ గురించి చర్చిస్తూ కొంతసేపు గడిపేశాము. చుట్టూ ఉన్న వారితో పరిచయం ఏర్పడింది. నా పక్కనున్న వ్యక్తి మంచిపై చాలా సుదీర్ఘంగా ఉపన్యాసమిచ్చాడు. చుట్టూ ఉన్న నలుగురూ ఆ చర్చలో పాలుపంచుకున్నారు. అంతలో మాకు నాలుగు సీట్ల ముందున్న ఓ వ్యక్తి సిగరెట్ వెలిగించి గుప్పుమని పొగ వదిలాడు. విండో అద్దాలు మూసి ఉండటం వల్ల పొగ బస్‌లో వ్యాపించింది.

''బస్‌లో పొగ తాగకుంటే ప్రాణం పోతుందా? దిగాక తాగొచ్చు కదా! ఛీ...ఛీ...'' అన్నాడు నా పక్కనున్న వ్యక్తి.

''ఈ సిగరెట్‌రాయుళ్లకు బుద్ధి లేకుండా పోతోంది'' విండోసైడ్ పెద్దమనిషి అసహనంగా ముఖం పెట్టాడు.

''బస్‌లో పొగతాగరాదనే స్లోగన్ రాతలకే పరిమితమవుతోంది. ఇలా బస్‌లో పొగ వదిలే వాళ్లని కేసు పెట్టి జైల్లో తోస్తేగానీ బుద్ధి రాదు'' కర్చీఫ్‌తో ముక్కు మూసుకుంటూ అన్నాడు నా ముందున్న కుర్రాడు. చుట్టూ ఉన్న వాళ్లు వంతపాడారు. కానీ ఆ రుసరుసలు, స్టేట్‌మెంట్లు ఇంజన్ శబ్దంలో కలిసిపోయాయి. ఆ వ్యక్తి మాత్రం గుప్పుగుప్పుమని పొగ వదులుతున్నాడు.

ఇక నేను ఓర్చుకోలేకపోయాను. లేచి ఆ వ్యక్తి దగ్గరకెళ్లాను. గళ్ల లుంగీ, చేతులు మడిచిన షర్ట్, బుర్రమీసాలు, గంపెడు జుట్టుతో మొరటుగా ఉన్నాడు.

''మీరు పొగతాగటం బస్‌లో అందరికీ ఇబ్బందిగా ఉంది. దిగాక తాగొచ్చు. ఆర్పేయండి'' అన్నాను. అతను నా వైపు అదోలా చూశాడు. సిగరెట్ ఆర్పలేదు. రిక్వెస్ట్‌గా చెప్పాను. పట్టించుకోలేదు.

''మీకే చెబుతోంది. వినిపించటం లేదా?'' అన్నాను.

''ఆర్పకుంటే ఏం చేస్తావ్? బస్ నీ అబ్బ సొమ్మా? సిగరెట్ వాసన పడకుంటే ప్రయాణానికి ఓ కారు తీసుకోవాల్సింది'' అన్నాడు పురుగును చూసినట్లు చూస్తూ.

నేటి అన్యాయాల గురించి, మంచి గురించి సుదీర్ఘ చర్చలు సాగించిన నా చుట్టూ ఉన్న తోటి ప్రయాణీకులు అండగా నిలబడగలరన్న నమ్మకంతో వాడి చేతిలోని సిగరెట్ లాక్కుని కిందేసి నలిపేశాను. వాడు ఆవేశంగా లేచి నా చొక్కా పట్టుకున్నాడు. కండక్టర్ జోక్యం చేసుకుని చొక్కా పట్టు విడిపించి కూర్చున్నాడు. వాడు నానా మాటలూ మాట్లాడుతూ కొట్టేవాడిలా ప్రవర్తిస్తున్నప్పటికీ ఒక్కరూ జోక్యం చేసుకోలేదు. నాకు సాయంగా నిలబడే ప్రయత్నం ఎవ్వరూ చేయలేదు. సరదాగా తమాషా చూస్తున్నారు. ఊహించని పరిస్థితి. బిత్తరబిగుసుకుపోయాను. వాడు పరుషంగా దుర్భాషలాడుతుంటే నాలో ఆవేశాన్ని అదుపుచేసుకుంటూ వచ్చి సీట్లో కూర్చున్నాను. వాడి నోరు మూత పడలేదు. ఏదేదో వాగుతున్నాడు. నేను ఏమాత్రం నోరు చేసుకున్నా ఆ సంస్కారహీనుడితో కలియబడాలి. మౌనంగా ఉండిపోయాను. ఏదిఏమైనా వాడి సిగరెట్ ఆర్పేయగలిగాను.

ఓ స్టేజిలో బస్ ఆగింది. ''నాకు ఇలాంటి గొడవల్లో తలదూర్చటం ఇష్టముండదండీ!'' అంటూ నా పక్కనున్న వ్యక్తి దిగటానికి లేచాడు. చుట్టూ ఉన్న వాళ్లు నాతో మాట్లాడటమే మానుకున్నారు.

నాకు జాలివేసింది. మంచిని గురించి సుదీర్ఘ ఉపన్యాసాలయితే ఇస్తారు కానీ వాటిని ఆచరించటం, మంచి మనుగడకు అండగా నిలవటం చేతకాని దద్దమ్మలని అర్థమైపోయింది.

నాకు ఏమాత్రం అవమానంగా లేదు. వాడు మాట్లాడుతున్న మాటలకు తలొంచింది నేను కాదు...నా చుట్టూ అందరూను.

**-డి.కె.చదువులబాబు**
**(ప్రొద్దుటూరు)**